## Super - by Puri Jagannath

Back

| | |
|---|---|
| Year Released | : 2005 |
| Language | : Telugu |
| Actors | : Nagarjuna, Sonu Sood, Ayesha Takia, Anushka |
| Music Director | : Sandeep Chowta |
| Director | : Puri Jagannath |
| Reviewer | : Parthu |
| | Read telugODu Review |

ఈ పేజీని పంపండి

"కాకి పిల్ల కాకి కి ముద్దు" లానే "నే తీసిన సినిమా నాకు ముద్దు" అని ప్రతి నిర్మాతా అనుకోవడం సహజం. అలానే తలపోసారు అక్కినేని వారు! ఈయన సినిమా ఈయనకి బాగా నచ్చేసింది కాబట్టి, ఆహా! "సూపర్" అనుకుంటూ, టైటిల్ పెట్టేసి తోసేసారు. అంత వరకూ బానే వుంది. ఇదే విధంగా ప్రతి నిర్మాతా ఫీల్ అయితే, ఇక కథ తో సంబంధం లేకుండా, మన కి "అమోఘం", "ఇరగదీసింది", "కేక", "అదుర్స్" లాంటి టైటిల్స్ గల చిత్రాలు వచ్చే ప్రమాదం లేకపోలేదు భవిష్యత్తు లో.




ఈ వారం, అన్నపూర్ణా స్టూడియోస్, ఎంతో ఖర్చు తో (స్వభావానికి విరుద్ధంగా) కోట్లు కుమ్మరించి తీసిన "సూపర్", కిక్కురుమనకుండా చూడటం జరిగింది. నాగార్జున అంటే ట్రెండ్ సెట్టర్ అని, ఇది వరకే ప్రూవ్ అయింది. పైగా 5 హిట్ సినిమాల తరువాత చేస్తున్న చిత్రం అంటే, సహజంగానే క్రేజీ ప్రోజెక్ట్ మరి! కట్టు బట్టలు, పెట్టిన బొట్లు (టాటూలు), వాడిన బైకులూ చూస్తుంటే, హాలీవుడ్ చిత్రానికి ఆమడ దూరం లోనే వున్న ఫీలింగు, పైపెచ్చు, MTV, FTV లాంటి ఏకాక్షర TV లన్నింటిలోనూ ఒక తెలుగు సినిమా పాట పాప్యులర్ అవటం తో అంచనాల సంచలనం. ఇది సగటు ప్రేక్షకుడి మానసిక పరిస్థితి ఈ చిత్రం పై.

నాగార్జున బైక్ రేస్ లో పాల్గొంటూ, కాల్ టాక్సీలు తిప్పుకుంటుంటాడు. ఒకసారి, అతని అసిస్టెంట్ చేసిన చిన్న పొరపాటు వల్ల, హీరోయిన్ (ఆయేషా) ని కలిసే మహత్ భాగ్యం అటు ప్రేక్షకులకీ, ఇటు నాగార్జున కీ దక్కుతుంది. ఆవిడ డాక్టర్. నాన్న (పరుచూరి వెంకటేశ్వరరావు), బతికి చెడ్డ వ్యాపారవేత్తగా చెప్పుకొచ్చారు. ఆవిడ పని చేసే హాస్పిటల్ స్టాఫ్ కూడా ఎంతో co-operative గా వుండటం తో నాగ్ కి ఆవిడ్ని లవ్ లో పడెయ్యటానికి కేవలం రెండే డ్రీమ్ సాంగులు అవసరమవుతాయి. ఇక, ఈ చిత్రం లో రెండో కథానాయకుడు (సోనూ సూద్), బ్రిడ్జ్ మీద, మిట్ట మధ్యాహ్నం ఒంటరిగా వెడుతున్న వాహనాలని దోచుకు బతుకుతున్నట్టు గా ఒకటి, రెండు షాట్స్ లో చూపిస్తారు. ఇతను దొంగతనానికి వెళ్ళేప్పుడు ఒక్కడే అయినా, ఇంటా, బయటా మాత్రం ఎవరో చాలా మంది పెర్సనల్ స్టాఫ్ చుట్టూ వున్నట్టు చూపిస్తారు (బహుశా ఇంకా వాళ్ళ అందరికీ ప్రొబేషనరీ పీరియడ్ పూర్తి అవలేదేమో దొంగతనాలకి తీసుకెళ్ళడానికి!)

ఇక డాక్టర్ గారు, రేసర్ నాగ్ కలిసి, ఊళ్ళో వున్న పబ్ లన్నీ, రోజుకొకటి చొప్పున తిరుగుతూ ప్రేమించుకుంటూ, సందీప్ చౌటా సమకూర్చిన "అపేహో" భాష కు సంబంధిచిన కొండ జాతి గీతాలు పాడుకుంటూ వుంటారు. ఒకసారి పబ్ లో, నాగ్, సోనూ ఇద్దరూ ఎదురుపడి, ఒకళ్ళనొకళ్ళు చాపెల్, గంగూలీ చూసుకున్నంత క్రూరంగా చూసుకుని వెళ్ళిపోతారు ఏదో కక్షలు వున్న వాళ్ళలా. అప్పుడు కనిపించే మెరుపుల, ఉరుముల వెనుక, మనకి కొంత "కథ" కనిపిస్తుందేమో అని ఆశ మొదలవుతుంది.

పోలీస్ బృందం ఒకటి లోకల్ ఆర్టిస్ట్ అయిన ఆలీ ని పట్టుకుని దొంగతనం చేసిన వాళ్ళ బొమ్మను గీయమంటూ కొంత కామెడీ చేయించడానికి ప్రయత్నం చేస్తుంటారు. ఇలా వుండగా, పిల్లలకి పెళ్ళి చేసేస్తే, కాల్ టాక్సీలన్నీ ambulances గా చేసేసి మెడికల్ బిజినెస్ చేసుకుంటార్లే, అని నాగ్ వాళ్ళ అమ్మా, డాక్టర్ గారి నాన్న తలపోస్తారు. పెళ్ళికి పిలవడానికి సోనూ సూద్ ఇంటికి వెళ్ళడం తో, అతను డాక్టర్ గారికి "అన్న" లాంటి వాడని మనకి తెలుస్తుంది. ఈ లోపు అనుకోకుండా accident లో ఆయేషా నాన్న పోతారు. సోనూ వచ్చి తన ఇంటి కి తీసుకెడతాడు ఎవరూ లేని ఆయిషా ని. "ఆ పెళ్ళి నేనే చేస్తాను, ఒకసారి అతన్ని పరిచయం చేయి" అనడం తో మనం ఇంటర్వెల్ కి రెడీ అవుతాం. అనుకున్నట్టుగానే, ఈ ఇద్దరు హీరోలూ, నువ్వెంత అంటే నువ్వెంత అన్న టైప్ లో చొక్కాలు పట్టుకోవడం తో మనకి బ్రేక్.

మళ్ళీ ఊహించినట్టుగానే, ఆయేషా అసలు కథ ఏమిటీ అండం తో ఇక "పూరి జగన్నాథ్" కి స్క్రిప్ట్ విప్పక తప్పలా. నాగ్, సోనూ, అతని చెల్లెలు (అనూష్క) "బాగా చదువుకున్నా, ఉద్యోగం రాకపోవడం తో, తప్పనిసరి పరిస్థితులలో..." అని శ్రీదేవి, "క్షణక్షణం" సినిమా లో వెటకారం గా చెప్పినా పట్టించుకోకుండా దొంగలు గా మారుతారు. పగలంతా బాంకులు దోచుకుంటూ, రాత్రి కి రెస్ట్ తీసికుంటూ హాయి గా జీవితాన్ని గడుపుతుంటారు. అనుష్క, నాగ్ ని ప్రేమిస్తున్నా అని చెప్పడం, నాగ్ ఏమో నాకు నా జుట్టు మీద వున్న ప్రేమ, నీ మీద లేదు అనడంతో, ఆ పిల్ల ఖంగు తిని రేపటి లోగా ప్రేమించకపోతే నే చస్తా అని "ముద్రగడ పద్మనాభం" పోలవరం ప్రోజెక్ట్ మీద చేసినంత హడావిడి చేస్తుంది. ఈ విష్యాన్ని సోనూ తో చెపుతాడు, వాడు వీడ్ని పెళ్ళి చేసుకోవచ్చు కదా అంటాడు, "కుదరదు, టైమ్ పాస్ కి కావల్సి వస్తే పబ్ లో తనతో కలిసి పెగ్గులూ, డాన్సులూ గట్రా వెయ్యగలను కానీ, పెళ్ళి జాంతా నై అంటాడు. ఈ సందట్లో, వీళ్ళ ఎంప్లాయర్, ఒక 50 కోట్ల ప్రోజెక్ట్ తెస్తాడు."కోహినూరో, చార్మినారో" వజ్రాలు కొట్టేయ్యాలని ప్లాన్". 50-50 అంటాడు. సరే

అని వీళ్ళు ఒప్పుకుంటారు. నాగ్ తేల్చక పోయేసరికి తన కిచ్చిన 2 పాటలు పూర్తి అవడంతో నేను చస్తున్నా, ఇదే లాస్ట్ కాల్ అని అనుష్క ఫోన్ పెట్టేస్తుంది విషయం తెలిసి, వీళ్ళు ఇద్దరూ వచ్చేసరికి ఆపిడ చనిపోయి వుంటుంది. ఫ్రెండ్స్ కాస్తా ఎనిమీస్ అవుతారు.

ఈ లోపు ఆలి, అంతకు ముందే నాగార్జునని ఒకసారి పొడుగాటి జుట్టు, మాసిపోయిన గెడ్డం తో చూసి వుండటం, అది గుర్తొచ్చి పోలీస్ స్టేషన్ లో అతని బొమ్మ గీస్తాడు. పోలీసులొచ్చి, నాగార్జునని పట్టుకుపోయి ఓ వీడియో కేసెట్ చూపిస్తారు. అందులో అనూష్కని ఎవరో చంపడం రికార్డ్ అయివుంటుంది. దానితో అసలు నిజం తెలియడం, మిత్రులిద్దరూ ఒకటవ్వడం అయిపోతాయి. మళ్ళీ ఊహించినట్టుగానే, డాక్టర్ గారిని విలన్ కాంప్ సరదా గా "గోవా" తీసుకెళ్ళడంతో చిన్నపిల్లలకి బోట్ చేజింగులూ, నీళ్ళలో బాంబులు పేలడాలూ లాంటి కోట్లు కుమ్మరించిన కృత్యాలు పూర్తి అయిన పిదప, అందరూ కలవడంతో, "నో..పూర్" చిత్రం చూసిన ప్రేక్షకులు అన్నపూర్ణా సంస్థ ఆహ్లాదకరం గా మలచిన అనేక చిత్రాలు గుర్తుకు తెచ్చుకుని దర్శక, నిర్మాతలని తిట్టిపోస్తారు.

ఫస్ట్ హాఫ్ లో కథ కానీ, కథనం కానీ, కామెడీ కానీ ఏదీ రక్తి కట్టించదు. పైపెచ్చు మన్మధుడు లాంటి నాగార్జున, "రాజపుత్ర రహస్యం లో NTR కి మోడర్న్ డ్రెస్ వేస్తే ఎలా వుంటారో అలా వున్నారు". ఏంటో గొప్ప చెప్పిన పాటలు, చిత్రీకరణ పర్వాలేదు అనిపించినా, పాటలు అంతా గోల గా వుండటం తో విసుగు పుట్టిస్తాయి. సెకండ్ హాఫ్, ఫ్లాష్ బేక్ నేరేషన్ మాత్రం కొంత స్పీడ్ గా, ఇంటెరెస్టింగ్ గానే తీసాడు. సినిమా ఈ మాత్రమైనా ఆడిందంటే బహుసా ఈ పార్ట్ కారణం అయివుండొచ్చు. క్లైమాక్స్ లో కూడా కొద్దిగా హైటెక్ లుక్ తీసుకొచ్చారు. కాస్త ఊరట కలిగిస్తుంది ఈ భాగం. బ్రహ్మానందం, ఆలీ, షియాజీ షిందేల మధ్య కామెడీ కొంత వరకే పేలింది.

పూరీ పై నాగార్జున వుంచిన నమ్మకాన్ని, పూరీ "చపాతీ" చేసాడు. శివమణి సినిమానే చక్కగా తీసాడు దీనితో కంపేర్ చేస్తే. నాగార్జున షరా మామూలే, సోనూ పర్లేదు.

సంగీతం మాత్రం, నాకు ఒక్క ముక్క వినపడలా, అర్ధం కాలా, నచ్చలా..బహుశా నేను ఇంకా ఇళయరాజా కాలం దగ్గరే ఆగిపోయివుండటం వల్ల అనుకుంటా.

$1 అంటే Rs 45.20 పైసలు అమ్మో! అనుకునే వాళ్ళకు మాత్రం కాదు ఈ చిత్రం!

---

Reviewer : telugODu
Read Parthu Review

---

ఈ పేజీని పంపండి

వరుస హిట్స్ తో సాగిపోతున్న నాగర్జున నిర్మిస్తూ, నటించిన చిత్రం సుపర్. సినిమా కోసం



లక్షలు ఖర్చుపెట్టి బైక్స్ కొన్నాం, పెప్పీ టేకింగ్, ట్రెండీ మ్యూజిక్ అంటూ నిర్మాత, డైరెక్టరూ విడుదల కు ముందు నుండీ చెప్పుకునీ, చాలా హైప్ క్రియేట్ చేయబడి,

చాలా హంగా ఆర్భాటలతో విడుదలైన చిత్రం "సూపర్".

కథ క్లుప్తంగా చెప్పాలంటే, ఓ ఇద్దరు ప్రాణ స్నేహితులు కొన్ని కారణాల వల్ల విడిపోయి, మళ్ళీ ఒకటై, విలన్ మీద ప్రతీకారం తీర్చుకోవటం. ఏ సినిమా కు అయినా కథ ప్రాణం. కథ పలుచన అయినప్పుడు కథనం కు చాల ప్రాముఖ్యత ఉంటుంది, కథనమే సినిమా కు ప్రాణం అవుతుంది. ఆ విషయం లోనే, సూపర్ కాస్త దెబ్బ తింది.

ఓ బైక్ రేస్ లో అఖిల్ (నాగర్జున) గెలవడం తో, సినిమా మొదలవుతుంది. ఈ సీన్ లో తప్ప ఎక్కడా విరివిగా బైక్స్ కనబడలేదు. (ఒక్కో బైక్ 10 లక్షలు, అలాంటివి పది కొన్నాం అని హీరో / డైరెక్టర్ చెప్పుకోవడం ఏదో సైట్ లో చదివాను. ఈ విషయం లో నాకు, "బాలు" సినిమా లోని, లక్షల విలువ చేసే "ఇటాలియన్ డిజైనర్" డిజైన్ చేసిన పాంట్ గుర్తొచ్చింది). అఖిల్ కు చాలా "కాల్ టాక్స్"లతో పాటు ఓ కార్ గెరేజ్ కూడా ఉంటుంది. ఒక సందర్భం లో హీరోయిన్ సిరివల్లి (ఆయేషా టకియా) ను చూసి మనసు పిచ్చలవిడిగా విసిరేసుకొని, వెంటపడటం మొదలెడతాడు. సిరివల్లి ఓ డాక్టర్. పేరుకు డాక్టర్ అయినా, ఆమె వేషధారణ మాత్రం, ఓ మోడల్ కన్నా ఓ మెట్టు పైనే ఉంటుంది. ఆ మాటకొస్తే, హాస్పిటల్ వాతావరణం కూడా అంతే. పనీ పాటా లేనట్టు, డాక్టర్లూ నర్సులూ మెట్ల మీద బాతాఖానీలు, వచ్చిపోయేవారి "హై, బై" లూ, కాఫీ షాప్ లో కాఫీలూ.. ఇలా అన్నమాట! కనీసం అది మెడికల్ కాలేజ్ అని చెప్పినా ఓ పద్ధతిగా ఉండేది! అయినా, ఇలాంటివన్నీ పట్టించుకోకూడదు. కథతో పాటు సాగాలి. ఓ 3,4 సీన్ల తరవాత, విధిగా హీరోయిన్ ప్రేమలో పడిపోతుంది. ఈలోపు, ఇంకో హీరో (సోనూ సూద్) పరిచయం. ఇతని ఇంట్రడక్షన్ మెయిన్ హీరో ఇంట్రడక్షన్ లా ఉంటుంది. తను ఓ దోపిడీ దొంగ.

అదేమిటో, కోట్ల కోట్ల కరెన్సీని తీసుకెళ్ళే ఓ బాంక్ ట్రక్ కు ముందూ వెనుకా ఏ సెక్యూరిటీ ఉండదు! హీరో చాలా కాజువల్ గా డబ్బు దోచుకొని వెళ్ళబోతోంటే, అప్పుడొస్తారు సెక్యూరిటీ. పాపం, వాళ్ళ కు ఏ తుపాకీలూ లేకుండా, కర్ర ముక్కలిచ్చి, ఆ డబ్బుకు కాపలా కాయమన్నట్టున్నారు. కర్ర ముక్కలతో హీరో తర్వాత హీరో అంతటి వాడిని ఏం చేస్తారు? తన్నులు తిని పడుకుంటారు! ఈ హీరో సిరివల్లి ని చెల్లెల్లా చూసుకుంటూంటాడు. అందుకు కారణం పూర్వాశ్రమం లో సిరివల్లి తండ్రి, తన మెకానిక్ షాప్ లో ఇతనికి జీవనోపాధి కల్పించటం!

ఈ దోపీడీలను అరికట్టడానికి స్పెషల్ ఆఫీసర్ (శియాజీ షిండే). ఎంత ప్రయత్నించినా పట్టుకోలేకపోతూంటాడు. వందరూపాయలకు పోట్రెట్స్ గీసే ఆర్టిస్ట్ (ఆలి), సోనూ ని చూస్తాడు. స్పెషల్ ఆఫీసర్ దగ్గరకు వెళ్ళి, తను దొంగను చూశానని, అతని బొమ్మ గీస్తానని చెబుతాడు. కాని, ప్రతిసారీ ఎవరెవరివో గీస్తూంటాడు. ఇదో సెపరేట్ కామెడీ ట్రాక్. సినిమాలో మెచ్చుకోదగ్గ విషయం ఆలి కామెడీ మాత్రమే.

ఒకటి, రెండు సార్లు అఖిల్, సోనూ ఎదురుపడతారు. ఏదో ఫాక్షన్ కక్షలు ఉన్నట్టు, కనబడగానే, ఒకరినొకరు తన్నుకోవడానికి ఉద్యుక్తులవుతూంటారు. ఏదో ఫ్లాష్ బేక్ ఉంది అని ప్రేక్షకులకు అర్థం అవుతూంటుంది. ఓ సందర్భం లో, తను చెల్లిలా చూసుకునే, సిరివల్లి ప్రేమించింది తన బద్ధ విరోధి అఖిల్ అని తెలిసి బాధ పడతాడు. ఎందుకు శతృత్వం అంటే, పెళ్ళి అఖిల్ ని అడుగు అంటాడు. అలాగే పెళ్ళి అడుగుతుంది.

** ఫ్లాష్ బేక్ మొదలు **

అఖిల్, సోనూ, సోనూ చెల్లెలు శష (అనుష్క) మంచి స్నేహితులు. గ్రాడ్యుయేషన్ చేసి, ఉద్యోగాలు దొరక్క, సమాజం లోని అవినీతిని చూసి, భరించలేక దొంగలవుతారు! ఎన్ని దోపిడీలు చేసినా, ఎవరికీ వీళ్ళు దొరకరు! మరి హీరోలు అన్నాక దొరుకుతారేంటి? పైగా, వీళ్ళు దొంగతనం చేసి, పారిపోయేదాక, పోలీసులకు వీళ్ళ వెంటబడటం ఇష్టం ఉండదు! ఆ విషయం ఒదిలేస్తే, శష అఖిల్ ను ప్రేమిస్తోంటుంది, కాని అఖిల్ తనకు అలాంటి ఉద్దేశ్యం లేదంటూంటాడు. పేరుకు ప్రేమ అని చెప్పినా, కామ పిశాచి లా బిహేవ్ చేస్తూంటుంది. అదే మాట సినిమా లో అఖిల్ కూడా అంటాడు. తన ప్రమేయం లేకుండా డ్రీమ్ సాంగ్ వేసుకోవడం కూడా జరుగుతుంది. ఓ సారి, తనను ప్రేమించకపోతే, ఆత్మ హత్య చేసుకుంటానని క్లబ్ లో పబ్లిక్ గా ఎనౌన్స్ చేస్తుంది. తరువాత సీన్ లో చచ్చిపోయి పడి ఉంటుంది. అఖిల్ వల్లే ఇది జరిగిందని, కోపం పెంచుకొని దూరం అవుతాడు సోనూ.

** ఇదీ ఫ్లాష్ బేక్ **

అక్కడితో అఖిల్, దోపిడీలు మానేసి, జనజీవన స్రవంతి లో కలసిపోయాడని ప్రేక్షకుడు అర్థం చేసుకోవాలి కాబోలు! సోనూ మాత్రం, తన దొంగ వృత్తి ని మానడు. అర్థం కాని విషయం ఏంటంటే, ఉద్యోగం రాక, దొంగగా మారిన సోనూ, సిరివల్లి వాళ్ళ నాన్న మెకానిక్ షాప్ లో ఉద్యోగం వెలగబెట్టింది ఎప్పుడు అని!?

ఇంత కథ జరిగాక కూడా, విలన్ అన్నవాడు లేడు. ఓ aim అంటూ లేకుండా సాగిపోతోందని గుర్తొచ్చింది కాబోలు, సడన్ గా ఓ విలన్ గాంగ్ ను పుట్టిస్తారు దర్శకుడు. విలన్ గాంగ్ ను పుట్టించటానికీ, హీరోలు ఇద్దరూ ఒక్కటవడానికి, ఓ ట్విస్ట్ ఉంటుంది (ఫ్లాష్ బేక్ లో). ఇక విలన్ గాంగ్ ను ఇంట్రడ్యూస్ చేశాక, వాళ్ళేదో పని చెయ్యాలిగా. సిరివల్లి ని కిడ్నాప్ చేసి, గోవా లో ఉన్న వజ్రాలు దోపిడీ చేసుకొని తెస్తే, సిరివల్లిని ఒదిలేస్తాం అనడం తో, హీరోలు వెళ్ళి, బోట్ చేజ్ లు, గట్రా నానా హంగామ చేసి, దొంగతనం చెయ్యడం, మాట తప్పిన విలన్ గాంగ్ ను చంపడం తో, కథ సుఖాంతం అవుతుంది.

కొన్ని చోట్ల నాగ్ gestures అభ్యంతరకరంగా, awkward గా ఉంటాయి (విలన్స్ తో). చూడటానికి కూడా మాసిన తల, గడ్డంతో, బికారి లా ఉంటాడు! సంతోషం చిత్రం నుండి మొన్నటి మాస్ దాకా, ఆల్మోస్ట్ ప్రతీ సినిమా లోనూ ప్లస్ పాయింట్, అందంగా కనిపించే నాగ్. ఈ చిత్రం కి పెద్ద మైనస్ పాయింట్, నాగ్! సోనూ సూద్ బావున్నాడు. తన పాత్ర కి వున్న పరిధి లో బాగా నటించాడు. తనకు హీరోయిన్ లేరు కాబట్టి, నాగ్ నే హీరో అనుకోవాలి, లేకపోతే, సోనూ నే హీరో. నటన ఎలా ఉన్నా, ఆయేష టకియా సెక్సీ డాక్టర్ గా బానే ఊరిస్తుంది. అనుష్క అస్సలు బాగోలేదు. ఆలి, శియాజి షిండే కామెడీ ట్రాక్ బావుంటుంది.

శృంగారం పాళ్ళు కాస్త తగ్గించి ఉంటే, "గిచ్చి గిచ్చి" పాట బానే ఉండేది. మిగతా పాటలన్నీ మ్యూజిక్ హోరు, మోతాదు మించిన షార్ట్ షాట్స్ జోరులో జారిపోతాయి. సీరియస్ గా సాగిపోతున్న సీన్స్ లో పంటి కింద రాయిలా, "ముద్దులెట్టి" పాట అడ్డుకుంటుంది. సినిమా కోసం రూపొందించిన పాటలు లా లేవు. ఏదో ప్రైవేట్ ఆల్బమ్ లేక డిస్కోథెక్ ల కోసం తయారు చేసిన పాటల్ని

వాడుకున్నట్టుంది. ఒక్కటీ సిట్యుయేషనల్ సాంగ్ కాదు. ఎవరో అన్నట్టు, ఏ పాటైనా సరే, ఎక్కడ కావాలన్నా తీసి / చేర్చుకోవచ్చు.

స్క్రీన్ ప్లే, డైరెక్షన్ గురించి చెప్పుకోవడానికి ఏమీ లేదు. సుమిత్ర (నాగ్ తల్లి) కి కొన్ని సీన్లలో, ఒక షాట్ లో బొట్టు ఉంటే, ఇంకో షాట్ లో ఉండదు! ఆ మాత్రం శ్రద్ధ కూడా తీసుకోకుండా తీసారు!